సాక్షి
కుమురం భీం
మంగళవారం । 22 । జూలై । 2025



గ్రీన్‌ఫీల్డ్.. చకచకా..

8లో▸

మంచిర్యాల– వరంగల్– విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో వేగం పుంజుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.



చెట్టుకిందే '108'

9లో▸

చింతలమానెపల్లి మండలానికి మంజూరైన 108 అంబులెన్స్‌ను రవీంద్రనగర్– 1 ఉన్నత పాఠశాల గది సమీపంలోని మైదానంలో చెట్లకింద నిలుపుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /24.5

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రత లు తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'23న విద్యాసంస్థల బంద్'

కాగజ్‌నగర్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ చేపట్టినట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడంతో విద్యారంగ సమస్యలు పేరుకుపోతున్నాయని, వెంటనే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకే సాయిక్రిష్ణ, చాపిలే సాయికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, సుంకరి సాయికృష్ణ, సాయినాథ్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 23న చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమీర్, భరత్, ప్రణయ్, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడాపాఠశాలలో ఈ నెల 24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్–14 విభాగానికి 2011 సెప్టెంబర్ 12 నుంచి 2013 సెప్టెంబర్ 11 మధ్య జన్మించి ఉండాలని, అండర్ –16కు 2009 సెప్టెంబర్ 12 నుంచి 2011 సెప్టెంబర్ 11, అండర్ –18కు 2007 సెప్టెంబర్ 12 నుంచి 2009 సెప్టెంబర్ 11, అండర్– 20 విభాగానికి 2005 సెప్టెంబర్ 12 నుంచి 2007 సెప్టెంబర్ 11 మధ్య జన్మించిన వారు అర్హులని వెల్లడించారు. విద్యార్థులు బోనోఫైడ్, బర్త్ సర్టిఫికెట్ తీసుకు రావాలని, మరిన్ని వివరాలకు 80080 90626 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులతో డీఎస్పీ రామానుజం

కౌటాల(సిర్పూర్): క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన బోదంపల్లి జట్టుకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ముత్తంపేట జట్టుకు రూ.5 వేల నగదుతోపాటు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్సై విజయ్, నాయకులు బుర్స నాగయ్య, సత్యనారాయణ, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు అధికారుల సంఘం వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖైరిగూడ ఓసీపీ వద్ద అధికారులను నిర్బంధించడాన్ని ఖండిస్తూ బెల్లంపల్లి ఏరియా అధికారులు సోమవారం జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ఆదివారం రెండో షిఫ్టుకు హాజరైన ఆపరేటర్లందరూ కలిసి అండర్ మేనేజర్ లక్ష్మీ నారాయణ, మల్లయ్యను గదిలో నిర్బంధించి బయటకు రాకుండా ధర్నా చేశారన్నారు. మూడో షిఫ్టుకు హాజరయ్యే అండర్ మేనేజర్ లక్ష్మీనారాయణను పరిశీలనకు వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఉజ్వల్‌కుమార్ బెహరా, ఉమాకాంత్, శ్రీనివాస రావు, కృష్ణమూర్తి, వీరన్న, మదీనాబాషా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ సంపూర్ణం

- జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్
- స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూత
- నిర్మానుష్యంగా మారిన బస్టాండ్లు, మార్కెట్లు
- మద్దతు పలికిన రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు



నిర్మానుష్యంగా కాగజ్‌నగర్‌లోని మార్కెట్ ఏరియా

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు సోమవారం చేపట్టిన బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను మహారాష్ట్రలోని తడోబా–అంధారి టైగర్ రిజర్వ్‌తో కలిపే జిల్లాలోని కారిడార్ అటవీ ప్రాంతాన్ని 'కుమురం భీం కన్జర్వేషన్ రిజర్వ్'గా ప్రకటిస్తూ జారీ చేసిన 49 జీవోకు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బంద్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు ఉదయం నుంచి మూసివేశారు. బస్సులను అడ్డుకోవడంతో బస్టాండ్లు నిర్మానుష్యంగా మారాయి. ఏజెన్సీ మండలాలైన లింగాపూర్, కెరమెరితోపాటు వాంకిడి, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాల్లో ప్రజలు బంద్ పాటించారు. పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో జనసంచారం కనిపించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఎలాంటి ఆందోళన వద్దు

టైగర్ కన్జర్వేషన్ పేరుతో తీసుకువచ్చిన జీవో 49 రద్దు అవుతుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీవో 49 రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. జీవో విడుదల అనంతరం జిల్లాలో పరిస్థితులను వివరించారు. కేంద్రం ఒత్తిడితో జారీ చేసిన జీవోపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టడం సరైంది కాదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జీవో రూపొందిందని, బీజేపీ ఒత్తిడితోనే జారీ అయిందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

బస్సులు అడ్డగింత

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్, గోండ్వానా ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులను అడ్డుకున్నారు. పోలీసులకు ఆదివాసీ నాయకులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఉదయం బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత పోలీసులు జోక్యం చేసుకుని బస్సుల రాకపోకలు కొనసాగించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ మాట్లాడుతూ టైగర్ కన్జర్వేషన్ పేరిట ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెసా చట్టం, 1/70 చట్టానికి వ్యతిరేకంగా ఈ జీవో ఉందని స్పష్టం చేశారు. 339 గ్రామాలను తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆదివాసీలతోపాటు ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.



జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

జీవో 49 నిలుపుదల

టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించారు. ఆదివాసీల ఆందోళనల దృష్ట్యా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఇచ్చిన నివేదిక మేరకు తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు జీవోను నిలిపివేస్తున్నట్లు మెమో జారీ చేశారు. కాగా, జీవో 49 శాశ్వతంగా రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకుడు మడావి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కాగజ్‌నగర్‌లో నిరసనలు

కాగజ్‌నగర్ పట్టణంలో వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతోపాటు నాయకులు రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవో 49ను అమలు చేస్తే జిల్లా అభివృద్ధి పూర్తిగా కుంటుపడి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఐద్వా మహిళా సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ కార్మిక సంఘాలు పూర్తి మద్దతు తెలిపాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ జిల్లాలోని 339 గ్రామాల ఆదివాసీ ప్రజలను వారి భూములకు దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగం పన్నాయని ఆరోపించారు. అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలపై కఠిన నిర్ణయాలు తీసుకోవడం సహించరానిదన్నారు. ఆర్టీసీ బస్సులు ఆసిఫాబాద్ డిపో నుంచి కాగజ్‌నగర్ బస్టాండ్‌కు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు. కాగజ్‌నగర్ బస్టాండ్ వెలవెలబోయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, అసెంబ్లీ కన్వీనర్, వీరభద్రచారి, నాయకులు సిందం శ్రీనివాస్, శంకర్, తిరుపతి, శ్రీనివాస్, సీపీఎం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు



జిల్లా కేంద్రంలో మూసిఉన్న దుకాణాలు



రాజీవ్‌గాంధీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జాప్యం లేకుండా ఉద్యోగులకు సేవలు



మాట్లాడుతున్న డీవైపీఎం రాజేశ్వర్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉద్యోగులకు జాప్యం లేకుండా సేవలందించాలని డీవైపీఎం ఎస్వీ రాజేశ్వర్‌రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్, గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు తదితర సంక్షేమ పథకాలు, ఉద్యోగుల గైర్హాజరు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గనులు, డిపార్టుమెంట్ల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. దరఖాస్తుదారులకు నిత్యం సమాచారం అందిస్తూ, వేగంగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేస్తూ పెండింగ్ దరఖాస్తులు లేని ఏరియాగా బెల్లంపల్లిని నిలపాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, సంక్షేమ అధికారి రజినికుమార్, జూనియర్ అసిస్టెంట్లు బాబా, సాగర్ పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన వృక్షం



రోడ్డుపై పడిన చెట్టు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని ఝరి గ్రామం సమీపంలో ప్రధాన రోడ్డుపై సోమవారం వృక్షం విరిగిపడింది. భారీ వర్షం కురువడంతోపాటు ఈదురు గాలులకు వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు చెట్టును పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఏఎస్పీ చిత్తరంజన్, అధికారులు

ఆసిఫాబాద్: సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వల స్థాయి, వినియోగం, వానాకాలం సీజన్‌లో వ్యవసాయ సాగు, యూరియా నిల్వలు, ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేస్తూ ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. యూరియా స్టాకు వివరాలు ప్రతీ షాపు ఎదుట బోర్డుపై ప్రదర్శించే విధంగా చూడాలని సూచించారు. భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జనజీవనానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రహదారులు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఇరిగేషన్ అధికారులు గుణవంత్‌రావు, ప్రభాకర్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, వ్యవసాయ శాఖ ఏడీ మిలింద్‌కుమార్, వైద్యారోగ్యశాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

'సమస్యలపై దశలవారీగా పోరాటం'



ఐక్యత చాటుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై దశలవారీగా పోరాటం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి(యూఎస్‌పీసీ) నాయకులు ప్రకటించారు. పట్టణంలోని విశ్రాంత సంఘ భవనంలో సోమవారం యూఎస్‌పీసీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని, ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నా, 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేసి, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. నూతన జిల్లాలకు డీఈవో పోస్టులతోపాటు ప్రతీ రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ డీవో, మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు 5,571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ పూర్తయినందున జీవో 2, 3, 9, 10 రద్దు చేసి, జీవో 11, 12 ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. గురుకులాల టైం టేబుల్ సవరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలానికి జీతం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చరణ్‌దాస్, వైద్య శాంతికుమారి, లక్ష్మణ్, జాడి కేశవ్, రాజ్‌కమలాకర్‌రెడ్డి, సురేశ్, మహేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలకు కొత్త శోభ

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం
- వసతుల కల్పనకు నిధులు సైతం..
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



కౌటాలలో సీసీ కెమెరాల ద్వారా తరగతులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు

కౌటాల(సిర్పూర్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధిపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడంతోపాటు నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. కొన్నేళ్లుగా అసౌకర్యాల మధ్య చదువులు కొనసాగుతున్న సర్కారు కాలేజీలు కొత్త శోభ సంతరించుకోనున్నాయి. దీనిపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 2,535 మంది చదువుకుంటున్నారు. జిల్లాలోని ఒక్కో కాలేజీలో 13 చొప్పున సీసీ కెమెరాలు అమర్చనున్నారు. ఇప్పటికే కౌటాల, కాగజ్‌నగర్ కళాశాలల్లో అమర్చగా, మిగతా చోట పనులు కొనసాగుతున్నాయి. తరగతుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ప్రతీ తరగతి గదితోపాటు ఆరుబయట వరండా, ప్రయోగశాలల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రోజువారీగా విద్యార్థుల హాజరు, బోధన తీరు కళాశాలల నిర్వహణ తదితర అంశాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపాల్‌తోపాటు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు.

కమాండ్ నుంచి కంట్రోల్..

అధ్యాపకులతోపాటు విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా వస్తున్నారా.. లెక్చరర్లు సక్రమంగా పాఠాలు చెబుతున్నారా.. తరగతిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. తదితర అంశాలు పర్యవేక్షించేందుకు ఇంటర్ బోర్డు సీసీ కెమెరాలు వినియోగించనుంది. సీసీ కెమెరాలు హైదరాబాద్‌లో గల నాంపల్లి ఇంటర్‌బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించనున్నారు. అధ్యాపకులు పాఠాలు చెప్పే విధానాన్ని కూడా అధికారులు, నిపుణులు పర్యవేక్షిస్తారు. ఇంటరాక్టివ్ సీసీ కెమెరాల ద్వారా సూచనలిస్తారు. విద్యార్థులు కాలేజీలకు సక్రమంగా హాజరు కాకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం పంపనున్నారు. పాఠశాలల్లో మాదిరిగా టీచర్, పేరెంట్ మీటింగ్‌కు కళాశాలల్లో కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు ఇంటర్‌బోర్డు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

వసతుల కల్పనకు నిధులు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు కోసం నిధులు మంజూరు చేశారు. ఏళ్లుగా వసతుల లేమితో సతమతమవుతున్న కళాశాలలకు మహర్దశ పట్టనుంది. జిల్లాలోని 11 జూనియర్ కళాశాలలకు రూ.1.64 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవనాల మరమ్మతు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ పనులు, తాగునీరు, గ్రీన్‌చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, ఫ్యాన్లు, షెడ్లు, భవనాలకు రంగులు వంటి పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనులను కూడా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకే అప్పగించాలని ఆదేశాలు వచ్చాయి.

నిధులు మంజూరు ఇలా..

కళాశాల	నిధులు(రూ.లక్షల్లో)
జైనూర్	15.70
కాగజ్‌నగర్	28.82
సిర్పూర్(టి)	10.60
కౌటాల	20
బెజ్జూర్	12.60
తిర్యాణి	16.80
దహెగాం	3.70
ఆసిఫాబాద్	15.40
కెరమెరి	25.50
వాంకిడి	3.70
రెబ్బెన	11.60

సరైన నిర్ణయం



కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం. ఆకతాయిలు కళాశాల వైపు రాకుండా విద్యార్థినులకు భద్రత ఉంటుంది. అధ్యాపకులు క్రమం తప్పకుండా తరగతులు బోధిస్తున్నారు. విద్యార్థుల హాజరు కూడా పెరిగింది. మధ్యాహ్న భోజనం అమలు చేస్తే బాగుంటుంది.

– స్వాతి, విద్యార్థిని, కౌటాల

నిరంతర పర్యవేక్షణ



జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సాంకేతిక నిపుణులు పనులు చేస్తున్నారు. కౌటాల, కాగజ్‌నగర్ కళాశాలల్లో ఏర్పాటు పూర్తయింది. కెమెరాలతో పూర్తి నిఘా ఉంటుంది. విద్యార్థుల హాజరు, అధ్యాపకులు సమయపాలన, ఫలితాల మెరుగుదలకు అవకాశం ఉంటుంది. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఇంకా ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే అమలు చేస్తాం.

– కళ్యాణి, డీఐఈవో

సీడ్‌బాల్స్ వేసిన జైలు సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మాణిక్‌గూడ అటవీ ప్రాంతంలో జైళ్లశాఖ జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జైలు సిబ్బంది సీడ్‌బాల్స్ విసిరే కార్యక్రమం చేపట్టారు. జిల్లా జైలులో ఖైదీలు తయారు చేసిన వివిధ రకాల పండ్ల మొక్కల సీడ్ బాల్స్‌ను అర్బన్ పార్క్‌లో వేసినట్లు తెలిపారు. సిబ్బంది రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీడ్‌బాల్స్‌తో జైళ్లశాఖ సిబ్బంది

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కుంటాల: మండలంలోని అందకూర్ పెద్ద చెరువులో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన వారు చెరువులో మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం అందించారన్నారు. సుమారు రెండు నెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడడంతో దుస్తులు, ఎముకలు మాత్రమే మిగిలాయన్నారు. నీలంరంగు జీన్స్ ప్యాంట్, ఆకు పచ్చ షర్ట్, పైన తెల్లని గీతలు ఉన్న దుస్తులు ధరించినట్లు తెలిపారు. నిర్మల్ నుంచి క్లూస్ టీం సభ్యులు వచ్చి నమూనాలను సేకరించారు. భైంసా రూరల్ సీఐ నైలు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఇద్దరిపై గంజాయి కేసు



నిందితులతో ఎస్సై మధుకర్

కెరమెరి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని కొఠారి గ్రామంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన బిలాజీ రావుకు ఆసిఫాబాద్ మండలంలోని సందీప్ నగర్‌కు చెందిన రియాజ్ 146 గ్రాముల గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి జార్ఖండ్‌వాసి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం జార్ఖండ్‌కు చెందిన ఉదయ్ పరహీయా (42) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. హైదరాబాద్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఉదయ్ మంచిర్యాలకు వచ్చి గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద ఉన్న ఆధార్‌కార్డ్, సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడు..



గణేశ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గౌరపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తబట్టలో చహకటి గంగారాం, భుంబాయి దంపతులకు సోము, శంకర్, గణేశ్ (19), క్రిష్ణ సంతానం. సోము, శంకర్‌కు వివాహాలు కావడంతో ఇతర గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. గణేశ్ ఇంటివద్ద ఉంటూ తల్లిదండ్రులకు పనిలో సహకరిస్తున్నాడు. కొన్నిరోజులుగా ఇంట్లో పనులు మానేసి తిరుగుతుండడంతో ఈ నెల 20న తండ్రి మందలించి వ్యవసాయ పనులకు వెళ్లాడు. క్షణికావేశంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్టాండ్ ప్రాంగణంలో మహిళ ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన జాదవ్ జ్యోతి కొన్ని రోజులుగా భోరజ్ మండలం లేకర్‌వాడలో ఉంటోంది. సోమవారం ఆదిలాబాద్ బస్టాండ్‌కు తన కుమారునితో కలిసి వచ్చిన జ్యోతి పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ముధోల్‌లో పట్టపగలే చోరీ



పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్

తానూరు(ముధోల్): ముధోల్ మండల కేంద్రంలోని సాయి మాధవ్‌నగర్ కాలనీలో సోమవారం పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు సాయినాథ్ ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఇంటికి వచ్చేసరికి తాళం పగుల గొట్టి ఉంది. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు అపహరించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై బిట్ల పెర్సిస్ ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్.. చకచకా..

- వేగంగా మంచిర్యాల-వరంగల్-విజయవాడ హైవే పనులు
- నాలుగు రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగు
- మారనున్న జైపూర్ రూపురేఖలు



12-14 ఫీట్ల ఎత్తులో సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు

జైపూర్: మంచిర్యాల-వరంగల్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో వేగం పుంజుకుంది. నాలుగు వరుసల రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి. ఒకవైపు 63వ నంబర్ జాతీయ రహదారి, మరోవైపు హైదరాబాద్ రాజీవ్ రహదారి రెండు ప్రధాన రహదారులను కలుపుకుని కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం చేపట్టడంతో జైపూర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. మంచిర్యాల జిల్లా రసూల్‌పల్లి కేంద్రంగా రింగ్ రోడ్డుతో కొత్త హైవే రోడ్డు ప్రారంభం కానుండగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. భారత దేశానికి సెంటర్ పాయింట్‌గా ఉన్న నాగ్‌పూర్ నుంచి దక్షిణాది రాష్ట్రాలకు సరుకుల ట్రాన్స్‌పోర్టు సౌలభ్యం సులభతరం కావడంతో పాటు దూర, సమయ భావం కలిసిరానుంది.

రూ.3,440 కోట్లతో 110 కిలోమీటర్లు

మంచిర్యాల జిల్లా నుంచి వరంగల్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ నాలుగు వరుసల ఎన్‌హెచ్-163జీ రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. జైపూర్ మండలం రసూల్‌పల్లి కేంద్రంగా ప్రారంభమైన కొత్త హైవే రోడ్డు ఎల్కంటి, టేకుమట్ల, నర్సింగాపూర్, బెజ్జాల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్ మీదుగా గోదావరినదిపై నుంచి పెద్దపల్లి జిల్లా మంథని, భూపాలపల్లి జిల్లా మేదరిమెట్ల నుంచి వరంగల్ జిల్లా ఉరుగొండ, నెక్కొండ, జనగామ జిల్లా ఆలేరు, పెరుమాండ్ల నుంచి ఖమ్మం మీదుగా విజయవాడ వెళ్లనుంది. రూ.3,440 కోట్లతో మొత్తం 110 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 22 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో 50కి పైగా చిన్న బ్రిడ్జీలు, 7 పెద్ద బ్రిడ్జీలను నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్న మెఘా ఇంజినీరింగ్ కంపెనీ ఇప్పటికే జిల్లాలోని పార్వతి బ్యారేజి (కిష్టాపూర్) వద్ద భారీ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ప్రస్తుతం వానలు లేకపోవడంతో రోడ్డు గ్రౌండ్ వర్క్ చకచకా జరుగుతోంది. నాలుగు వరుసలతో 12 నుంచి 14 ఫీట్ల ఎత్తులో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మిస్తున్నారు. నర్సింగాపూర్, వేలాల వద్ద ఇంటర్ ఛేంజ్ (రోడ్డు ఎక్కడం, దిగడం)కోసం నిర్మాణాలు సాగుతున్నాయి.

హైవేతో కొత్త కళ...

ఇప్పటికే జైపూర్ పారిశ్రామికంగా చాలా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడే సింగరేణి సంస్థ 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును నెలకొల్పగా దానిని విస్తరిస్తూ మరో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. జైపూర్ మండలానికి ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు రాజీవ్ రహదారి ఉండగా కొత్తగా నిర్మించనున్న వరంగల్-విజయవాడ హైవేతో కొత్త కళ సంతరించుకోనుంది. భవిష్యత్‌లో ఈ ప్రాంతం పట్టణంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉండడంతో ఇక్కడి భూములు కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఒక ఎకరాకు రూ.కోటికి పైగానే ధర పలుకుతోంది.

కూతుర్ని స్కూల్‌కు పంపించేందుకు వెళ్తూ...

- బైక్ అదుపుతప్పి వంతెన పైనుంచి పడి తండ్రి మృతి
- కూతురుకు తీవ్రగాయాలు



గణేశ్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

భైంసారూరల్: కూతుర్ని స్కూల్‌కు పంపించేందుకు బైక్‌పై వెళ్తూ వంతెన పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు.. కుభీర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ దొంతుల గణేశ్ (43) కుమార్తె నిఖిల హైదరాబాద్‌లోని చైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. సోమవారం తెల్లవారుజామున 4:50 గంటలకు బాసర నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తెల్లవారుజామున కూతుర్ని బైక్‌పై ఎక్కించుకుని బాసరకు బయలుదేరాడు. దేగాం వద్ద 161బీబీ హైవే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైవేపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు, లైట్లు లేక పోవడంతో బైక్ అదుపుతప్పి వంతెన పైనుంచి కిందపడింది. ఘటనలో గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిఖిలకు తీవ్రగాయాలు కావడంతో 108లో భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. నిర్లక్ష్యం ప్రదర్శించి పలువురి మృత్యువాతకు కారణమవుతున్న హైవే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కుమార్తెను చూసేందుకు వెళ్లి తండ్రి మృతి

వాంకిడి: హాస్టల్‌లో ఉంటున్న కూతుర్ని చూసివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఘాట్‌జనగాంకు చెందిన సెండె సంతోష్(34) కుమార్తె అనుష్క లింగాపూర్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఆదివారం కుమార్తెను చూసేందుకు సంతోష్ బైక్‌పై వెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఘట్‌జనగాం శివారులో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్సులో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య సెండె మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్టీ ఆశ్రమ విద్యార్థినులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల వసతిగృహంలో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని తరుణి జ్వరంతో, ఆరోతరగతి విద్యార్థిని రేవతి (టాన్సిలైటిస్) కుతికలతో బాధపడుతుండగా రెండు రోజుల క్రితం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ప్రచారం జరుగుతోంది. దీనిపై వసతిగృహ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సోమవారం విద్యార్థినుల కుటుంబ సభ్యులు వసతిగృహ గేటు ఎదుట నిరసన తెలిపారు.

అనాలోచిత చర్యలకు పాల్పడితే కఠినచర్యలు

వసతిగృహ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. కాగా కలుషిత ఆహారం తినడం వల్ల జరిగిందని అవాస్తవ ప్రచారం చేసి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

అస్సాం రైఫిల్ జవాన్ ఆకస్మిక మృతి



ఆకాశ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన నలువల విజయ్, సుగుణ దంపతుల కుమారుడు నలువల ఆకాశ్ (24) 2025 ఫిబ్రవరి 24న అస్సాంలోని రైఫిల్ రెజిమెంట్ క్యాంపులో జవానుగా విధుల్లో చేరాడు. సోమవారం ఉదయం 20 కిలోమీటర్ల రన్నింగ్‌లో భాగంగా పరుగులు తీస్తూ కిందపడిపోయాడు. తోటి జవాన్లు వెంటనే సైనిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆర్మీ అధికారులు విషయాన్ని ఆకాశ్ తల్లిదండ్రులకు తెలియజేయడంతో షాక్‌కు గురై కుప్పకూలారు. పార్థివదేహం మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకుంటుందని ఎస్సై సంజయ్ తెలిపారు.

కుక్కను ఢీకొని ఒకరు..

వాంకిడి: ద్విచక్ర వాహనంతో కుక్కను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అడ్డగుంటపల్లికి చెందిన మొగిళి బక్కయ్య (46) ఆదివారం మహారాష్ట్రలోని పాసిగాంలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వాంకిడి మండలంలోని గోయెగాం శివారులో బైక్‌కు అడ్డువచ్చిన కుక్కను ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుని సోదరుడు రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

తానూరు(ముధోల్): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో పలువురు మోసపోయిన ఘటన మండలంలోని విట్టోలి తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు సూర్యాపేట జిల్లా చెరువు తండాకు చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్‌కు అమ్మాయిలాగా పరిచయమయ్యాడు. ఉద్యోగం ఉంటేనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతని వద్ద రూ.20 వేలు, అతని బంధువైన ఉమేశ్ వద్ద రూ.20 వేలు తీసుకున్నాడు. వారం రోజుల క్రితం విట్టోలి గ్రామానికి వచ్చి తాను పోస్టల్ ఉద్యోగినని గ్రామస్తులను పరిచయం చేసుకున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తానని పవార్ పూజ, రాథోడ్ భుమేశ్వరి, రాథోడ్ కరుణ్, పవార్ అజేష్, రాథోడ్ సంత బాయి, జాదవ్ ప్రకాష్, చౌవాన్ జగదీష్, రాథోడ్ మల్కా, జాదవ్ విశ్వనాథ్, రోహిణి వద్ద రూ.20 వేల చొప్పున వసూలు చేశాడు. ఆ తర్వాత ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు సోమవారం ముధోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కార్మిక సమస్యలపై దశల వారీ పోరాటం



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా పోరాటం చేయనున్నట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో జూలై 24 నుంచి 31 వరకు గనులపై గేట్ మీటింగ్‌లు పెట్టి కార్మికులను చైతన్య పరుస్తామని, రెండో విడతలో ఆగస్టు 5 నుంచి 14 వరకు జన సంపర్క అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత, మూడో విడతలో ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 5 వరకు డిపార్టుమెంట్లు, కార్మిక వాడల్లో సమావేశాలు నిర్వహిస్తామని, నాలుగో విడతలో సెప్టెంబర్ 15న అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, మిట్టపల్లి మొగిలి, కుమ్మరి చంద్రశేఖర్, బుర్ర అరుణ్‌గౌడ్, చల్ల ప్రశాంత్, శేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 49 రద్దు హర్షణీయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



జీవో రద్దు ఉత్తర్వులు చూపిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఉట్నూర్‌రూరల్/ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో రద్దు చేసినందుకు ఆదివాసీల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ దండే విఠల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీవో 49 రద్దుకు వినతిపత్రం అందజేశారు. జీవో విడుదల అనంతరం జిల్లాలో పరిస్థితులపై కూలంకషంగా వివరించారు. కాగా, జీవో రద్దు ఉత్తర్వుల అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిత్యం ఆదివాసీల కోసం పని చేస్తోందని తెలిపారు. మాజీ ఎంపీ సోయం బాపురావు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్

- డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్



క్షతగాత్రులను పరామర్శిస్తున్న డీఎఫ్‌వో ప్రశాంత్

ఆదిలాబాద్‌టౌన్: అటవీ భూములను ఆక్రమిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో ముల్తానీలు, కొంతమంది దుండగులు చేసిన దాడిలో గాయపడిన పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. సోమవారం యాపల్‌గూడ 2వ బెటాలియన్ కానిస్టేబుళ్లు రాకేష్, ప్రశాంత్, షేకును రిమ్స్‌లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని పేర్కొన్నారు. అటవీ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్, అటవీ శాఖ సిబ్బంది అమర్, వెంకటేష్, రాథోడ్ గులాబ్, తదితరులు ఉన్నారు.

పాముల కాలం.. జర భద్రం

- పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి
- వైద్యాధికారి అజయ్ కుమార్



లక్ష్మణచాంద: వానాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పశువులు బీడు భూములు, అడవిలోకి మేతకు వెళ్లినప్పుడు విషసర్పాలు కాటేసే ప్రమాదం ఉంది. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి అజయ్ కుమార్ సూచిస్తున్నారు.

రక్త పింజర కాటు వేస్తే...

పశువులను రక్త పింజర కాటు వేస్తే హీమోటాక్సిన్ విడుదలై రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో పశువు నోరు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. కాటు వేసిన చోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మూత్రం ఎరుపు రంగులో వస్తుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే పది గంటల్లోపు మృత్యువాత పడుతాయి.

త్రాచు, కట్ల పాములు

త్రాచు, కట్ల పాములు పశువులను కాటు వేసినప్పుడు న్యూరోటాక్సిన్ వాటి శరీరంలోకి వెళ్లి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో శ్వాస వ్యవస్థ స్తంభిస్తుంది. నోటి నుంచి నురగ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే పశువు మృతి చెందుతుంది.

విషరహిత పాము కాటు లక్షణాలు

రెండు వరుస పళ్ళ ముద్రలు ఉంటాయి. కానీ వాటిలో పెద్దగా నిదానమైన రెండు ముద్రలు ఉండవు (విషపాము వద్ద వాటితో టాక్సిన్ ఇంజెక్ట్ చేస్తుంది). గాయాలు చిన్నగా ఉంటాయి. ఎక్కువగా పలుచని రేఖల వంటి ముద్రలుగా ఉంటాయి. కొద్దిగా రక్తం కారవచ్చు. కానీ ఇది ప్రమాద కరమైన స్థాయిలో ఉండదు.

విషపూరిత పాముకాటు లక్షణాలు

కాటు చేసిన చోట ఉబ్బినట్టు, గాయంలా కనిపిస్తుంది. పశువు తినకుండా, నీరసంగా ఉంటుంది. అదుపు తప్పటం (పిచ్చెక్కినట్టుగా) అటు ఇటు తిరగడం, నోటిలో నురుగు రావడం, వేగంగా గుండె చప్పుళ్లు, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, పొట్ట ఉబ్బడం, కింద పడిపోయి కాళ్ళు కొట్టుకోవడం చేస్తాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 గంటల్లోనే మృతి చెందుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పాము కాటుకు గురైన పశువును బయటకు పంపవద్దు. ఎక్కువగా నడిపించవద్దు. కదలకుండా ఉంచాలి.
- కాటు వేసిన ప్రాంతానికి పైభాగంలో గట్టిగా కట్టుకట్టాలి. ఇది పాము విషం నరాల ద్వారా వ్యాపించకుండా ఉపయోగపడుతుంది. 15 నిమిషాలకోసారి నిమిషం పాటు విరమించాలి. లేదంటే నరాలు నశించే ప్రమాదం ఉంది.
- కాటు వేసిన చోట కడుగవద్దు. కట్టు తీయవద్దు. ఇలా చేస్తే విష వ్యాప్తి పెరుగుతుంది.
- పశువును నీడలో బాగా గాలి తగిలేటట్లు ఉంచాలి. తల ఎత్తిన స్థితిలో ఉండేలా చూడాలి.
- వెంటనే పశువైద్యుడిని సంప్రదించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు.

సకాలంలో చికిత్స అందించాలి



పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు తరచూ గమనించాలి. పాము కాటువేస్తే కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టుకట్టాలి. బ్లేడుతో కోసి రక్తం పిండాలి. 20 నిమిషాలకోసారి కట్టును వదులు చేస్తూ ఉండాలి. స్నేక్ ఆంటీవీనమ్ ఇంజక్షన్, అట్రోసిన్ సల్ఫేట్, ఏవిల్ ఇంజక్షన్ పశువు రక్తంలోకి ఎక్కించాలి. నొప్పి నివారణకు స్టీరాయిడ్స్, ఆంటి బయాటిక్స్, కార్టికోస్టియిడ్స్, అనాలెజిక్స్, గ్లూకోస్ వంటి మందులు అవసరాన్ని బట్టి ఇవ్వాలి.

– అజయ్ కుమార్, పశు వైద్యుడు, లక్ష్మణచాంద

ఆస్పత్రికెళ్తే ఇల్లు ఖాళీ చేశారు..!

భైంసాటౌన్: కుమారుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్తే.. దొంగలు ఇంట్లో చొరబడి బంగారం, నగలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. రాహుల్‌నగర్(సాయినగర్)కు చెందిన పుష్పాల సాగర్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. ఉదయం తాళం పగులగొట్టి ఉండడంతో గమనించిన ఇంటి యజమాని సాగర్‌కు సమాచారమిచ్చాడు. వారు వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. 8 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.50 వేల వరకు నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. పోలీసులకు సమాచారమివ్వడంతో క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




పాండ్వపూర్ సమీపంలో..



గంగాపూర్ అడవుల అందాలు

కనువిందు చేస్తున్న కడెం అందాలు

సహజ సిద్ధమైన ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటున్నాయి కడెం అడవులు. కడెం మండలంలో గంగాపూర్, దోస్త్‌నగర్ నుంచి జన్నారం వైపు వెళ్లే రహదారిలో కొండలు, కొనలు, వాగులు, వంకలు ప్రకృతి రమణీయతతో కట్టిపడేస్తున్నాయి. – కడెం



అడవి మధ్యలో వాచ్ టవర్

తప్పని తెప్ప ప్రయాణం

కడెం మండలంలోని గంగాపూర్, రాణిగూడెం, కొర్రతండా పంచాయతీలకు చెందిన పది గ్రామాల ప్రజలకు దశాబ్దాలుగా తిప్పలు తప్పడంలేదు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఖానాపూర్ మండలంలోని దేవునిగూడెం మీదుగా కడెం వాగులో నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల వరదనీరు ఎక్కువ కావడంతో బ్యాక్‌వాటర్ పెరిగిపోయింది. దీంతో ప్రమాదకరమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో వాగులో తెప్పమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వాగు దాటాలంటే ఒక్కొక్కరు రూ.20 చెల్లిస్తున్నారు. పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా తమ దారికష్టాలు మాత్రం తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఖానాపూర్

తెప్పపై వెళ్తున్న గంగాపూర్ వాసులు

